క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన న్యాయవాదులు

అలంపూర్: అలంపూర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మలిపెద్ది సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా జడ్జి కుశను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. బుధవారం జిల్లా జడ్జిని అలంపూర్ బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటైన తర్వాత మొదటిసారి కలిసి, అలంపూర్‌లో నిర్వహిస్తున్న స్వాతంత్ర్యం దినోత్సవ వేడుకలకు ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమానికి తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు నడిగడ్డ వాసి కొండారెడ్డి, తదితర్లకు సన్మానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ అడ్వకేట్ ఇస్మాయిల్, సీనియర్ న్యాయవాదులు నారాయణరెడ్డి, శాంతి మల్లప్ప, ఈదుర్బాష, అలంపూర్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు యాకోబ్, ప్రధాన కార్యదర్శి అంజనేయులు, సహాయ కార్యదర్శి చిన్న కిషన్‌రావ్ పాల్గొన్నారు.

పచ్చర్లలో పట్టపగలే చోరీ

రాజోళి: మండలంలోని పచ్చర్లలో పట్టపగలే చోరీ జరిగింది. ఎస్‌ఐ జగదీష్ తెలిపిన వివరాలిలా.. గ్రామానికి చెందిన మోజేష్ తన పొలంలో సీడ్ పత్తి సాగు చేస్తున్నాడు. మంగళవారం ఉదయమే పొలానికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి రాగా.. అప్పటికే బీరువా పగులకొట్టి ఉండటం గమనించాడు. బీరువాలో చూడగా రూ.90 వేల నగదు కనిపించలేదు. ఇంటికి వెనుక భాగం మరో తలుపు వైపున ఉన్న మార్గంలో గుండా ఇంట్లోకి వచ్చి, లోపలే ఉన్న దొంగ మోజేష్ రాగానే, ఆయనను తోసేసి పరారయ్యాడు. బాధితుడు పోలీసులకు సమాచారమిచ్చాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఉండవెల్లి: అక్రమంగా తరలిస్తున్న 8.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించిన సంఘటన బుధవారం మండలంలోని డి.బూడిదపాడు శివారులో చోటుచేసుకుంది. కానిస్టేబుల్ రవి, రమేష్‌ల వివరాల ప్రకారం.. తండ్రీకొడుకులు కుర్వ శాంతన్న, విజయ్‌లు అంలపూర్ చౌరస్తా నుంచి అక్రమంగా 8.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారితో ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో : ఇద్దరికి గాయాలు

మానవపాడు: జాతీయ రహదారిపై గుర్తు తెలియని ఆటో బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పెట్రోలింగ్ సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలం, సంగినేనిపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ వెంకటేష్, స్నేహితుడు మహేష్‌తో కలిసి కర్నూల్ వైపు వెళ్తున్నారు. జాతీయ రహదారి-44 జల్లాపురం స్టేజీ వద్ద గుర్తు తెలియని ఆటో బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వెంకటేష్, మహేష్‌లకు గాయాలు కావడంతో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలోని స్కందాలో ఉంటున్న వీరేష్‌పై ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి నగదు, మొబైల్, సిల్వర్ గొలుసు తీసుకెళ్లిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మంగళవారం రాత్రి సమయంలో వీరేష్ బంధువులు మరణిస్తే వెళ్లి రాత్రి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఒకచోట బాత్రూంకని బైక్ ఆపి పోతున్న క్రమంలో రెండు బైకులు మీద ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి దాడి చేశారు. వీరేష్‌ను బెదిరించి అతని వద్ద మొబైల్, రూ.8వేల నగదు, తులం సిల్వర్ గొలుసు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

వాహనాల తనిఖీ

మానవపాడు: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, అక్రమాలకు పాల్పడే వ్యక్తులపై చర్యల తీసుకుంటున్నామని ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. బుధవారం మండలంలోని జాతీయ రహదారి-44పై విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆకస్మిక తనిఖీ, సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. మద్యంతాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ధ్యాన కేంద్రానికి భూమిపూజ

అయిజ: మండల కేంద్రంలోని రంగుపేటలో బుధవారం రాజయోగిని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్‌చార్జి బీకే మహాదేవి ధ్యాన కేంద్రం భవనం నిర్మించేందుకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ధ్యాన కేంద్ర భవనం లేకపోడంతో ఇంతకాలం అద్దె భవనంలో ధ్యాన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. నూతనంగా ధ్యాన కేంద్ర భవనం నిర్మించి దాంట్లో ధ్యానం కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చాంద్‌పాష డిమాండ్ చేశారు. అంతకుముందు హైదరాబాద్‌కు వెళ్తున్న పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు పీడీఎస్‌యూ నాయకులు తెలిపారు.

చెన్నిపాడులో చెరగని ముద్ర

- 1930లోనే గ్రంథాలయం స్థాపన
- సందర్శించిన ప్రముఖులు


రజతోత్సవ వేడుకల సందర్భంగా నాడు తీసిన ఫొటో

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో 1930లో ఆంధ్ర యువజన సమితి పేరుతో గ్రంథాలయం స్థాపించారు. ఇది కేవలం మూడేళ్లు మాత్రమే కొనసాగి తర్వాత మూతబడింది. వెనుకబడిన తెలంగాణలో రాజకీయ చైతన్యం, విజ్ఞానం పెరిగి వార్తాపత్రికలు, గ్రంథాలయాల ఆవశ్యకత గుర్తించి కొందరు యువకులు 1946లో సమావేశమై 'ఆంధ్ర యువజన గ్రంథాలయం' పేరిట తిరిగి ప్రారంభించారు. స్థానికుడు పోలీస్ పటేల్ నారాయణరెడ్డి తాను నిర్మించుకున్న ఇంటిని గ్రంథాలయానికి దానంగా ఇవ్వగా.. అలపూరిరెడ్డి, గుంతా శేషయ్య, బస్వాపురం వెంకటరెడ్డి గ్రంథాలను అందించారు. తర్వాతి కాలంలో గ్రంథాలయ నిర్వహణ ఆర్థిక భారం కావడంతో గ్రంథాలయానికి అనుబంధంగా ఖాదీ ఉత్పత్తి కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభించలేదు. దీంతో యువ కార్యకర్తలే ముందుకొచ్చి బాధ్యతలు స్వీకరించడంతో గ్రంథాలయం రెండేళ్లు కొనసాగింది. ఖాదీ ఉత్పత్తి కేంద్రం కూడా నాణ్యమైన వస్త్రాలను తయారుచేసి పేరుపొందుతున్న సమయంలో దేశ ప్రజలపై రజాకార్ల దురాగతలు పెరిగాయి. దీంతో అలంపూర్ తాలుకాలో 'స్టేట్ కాంగ్రెస్' ఉద్యమం తీవ్రమైంది. 1947, ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం లభించింది. తాలుకా కేంద్రంగా ఉన్న చెన్నిపాడులో అదేరోజు సత్యాగ్రహం జరిగింది. ఉద్యమంలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు జైళ్లకు వెళ్లకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర సరిహద్దుల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసి పోరాటం తీవ్రతరం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని కర్నూలుకు మార్చారు. అన్ని తాలుకాల కార్యకర్తలను కర్నూలుకు చేర్చారు. చెన్నిపాడు యువకులు సైతం సమరంలో పాల్గొనడంతో గ్రంథాలయం, ఖాదీ ఉత్పత్తి కేంద్రం నిలిచిపోయాయి. యువ కార్యకర్తల ప్రయత్నాల ఫలితంగా 1950లో గడియారం రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని పునరుద్ధరించి ప్రథమ వార్షికోత్సవంపై తీర్మానం చేశారు.


1932లో ఏర్పాటు చేసిన గ్రంథాలయ భవనం


ప్రస్తుత గ్రంథాలయం

● ప్రథమ వార్షికోత్సవం..

1950, అక్టోబర్ 30న గ్రంథాలయ ప్రథమ వార్షికోత్సవం జరిగింది. సభాధ్యక్షులుగా గడియారం రామకృష్ణశర్మ, గోల్కొండ పత్రికా సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి, ఉపన్యాసకులుగా కర్నూలు ఆంధ్ర గ్రంథాలయ నిర్వాహకుడు మన్నవ వెంకట్రామయ్య వ్యవహరించారు.

● మొదటి పాలకవర్గం..

గ్రంథాలయం స్థాపించిన సమయంలో ఒక పాలక వర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కొత్తింటి రామచంద్రారెడ్డి, కార్యదర్శిగా నాగిరెడ్డి, సహాయ కార్యదర్శిగా సంజీవరెడ్డి, సభ్యులుగా సోమిరెడ్డి, కాంతారెడ్డి, హన్మంతరెడ్డి, పద్మనాభరెడ్డి, నాగిరెడ్డి, కృష్ణారెడ్డి కొనసాగారు.

● 1970లో రజతోత్సవాలు..

గ్రామంలో ఆంధ్ర యువజన గ్రంథాలయ రజతోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మహాసభ స్వాగత కవితను గడియారం రామకృష్ణశర్మ రచించారు. గ్రంథాలయ విశిష్టతపై వేముల లక్ష్మణ స్వామి కవితలు రాశారు. ఉత్సవాలకు తాలుకాలోని 30 గ్రామాల ప్రముఖులు, పరిసర గ్రామాల ప్రజలు రెండు వేల మంది వరకు పాల్గొన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి ప్రయాణ సౌకర్యం, భోజన వసతి కల్పించారు. కర్నూలు నుంచి ఫొటోగ్రాఫర్లు, ఆలిండియా రేడియో రిపోర్టర్ కృష్ణమూర్తి హాజరై దూర శ్రవణ యంత్రాలు అమర్చారు. సభ రెండ్రోజుల పాటు కొనసాగింది.

● 1998లో స్వర్ణోత్సవాలు..

1998, మార్చి 7న గ్రంథాలయ స్వర్ణోత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా నారాయణరెడ్డి, బహుభాషా కోవిదుడు మాడుగుల నాగఫణిశర్మ, రచయిత డా. ఎల్లూరు శివారెడ్డి, అధ్యాపకులు డా. సురవరం పుష్పలతాదేవి, సాహిత్య విమర్శకుడు గడియారం రామకృష్ణ శర్మ, రాజనీతిజ్ఞులు, స్వాతంత్ర్య ఉద్యమ నిర్వాహకుడు పాగ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

● ప్రముఖుల సందర్శన..

చెన్నిపాడు ఆంధ్ర యువజన గ్రంథాలయాన్ని 1953లో ఆంధ్రదేశ గ్రంథాలయ సహాయ కార్యదర్శి రామలింగారెడ్డి, 1957లో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి నర్సింగరావు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల నరోత్తంరెడ్డి, 1958లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ ఉపాధ్యక్షురాలు అనంతలక్ష్మి, చాగలమర్రి సుబ్బారెడ్డి, 1962లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సంజీవయ్య, 1967లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు నారాయణరావు, 1967లో ఉస్మానియా మహిళా కళాశాల ఆంధ్ర ఉపన్యాసకురాలు యశోదారెడ్డి సందర్శించారు.

58 ఏళ్లుగా జెండా ఎగరేసేది రైతులే..



ఉండవెల్లి: జోగుళాంబ గద్వాల్ జిల్లాలో ఉండవెల్లి మండల కేంద్రంలో రైతులు సంఘాన్ని నియమించి ఇప్పటికి రైతు సంఘం ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తారు. ఉండవెల్లిలో 1966 నుంచి ఊరవాకిలిపై మూడు సింహాల నడుమ త్రివర్ణ జెండాను అప్పటి గ్రామ రెవెన్యూ అధికారులు ఎగురవేసేవారు. ఇప్పటికీ 58 ఏళ్లుగా రైతులందరు 5 మంది కమిటీగా ఏర్పడి ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం రోజు జెండాను ఎగురవేస్తారు. అధికారులు లేకుండానే రైతుల కోసం త్రివర్ణ జెండాను ఎగురవేస్తున్న గ్రామంగా పేరుందని గ్రామస్తులు తెలిపారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవంలో రైతులే ఆదర్శంగా జెండాను ఎగురవేస్తున్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు


రాజోళిలో తోరణాలు సిద్ధం చేస్తున్న చిన్నారులు


శాంతినగర్‌లో ఎమ్మార్సీకార్యాలయం ఎదుట జెండా కర్రను సిద్ధం చేస్తున్న సిబ్బంది

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం స్వాతంత్ర దినోత్సవానికి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు ముస్తాబు చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంఈఓ, మండల ప్రజా పరిషత్, ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ముస్తాబు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సిద్ధమవుతున్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవానికి త్రివర్ణ కాగితాలతో తోరణాలు కట్టిముస్తాబు చేస్తున్నారు.

రాజోళి: పంద్రాగస్టును పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి. మండల కేంద్రం, ఆయా గ్రామాల్లో భవనాలకు మూడు రంగుల జెండా కాగితాలు, తోరణాలు కట్టి అలంకరిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ కార్యాలయాతో పాటు, ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల దగ్గర జెండా పండుగకు కావాల్సిన ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. జెండా తోరణాల దగ్గర విద్యార్థులు సందడి చేశారు.

శాంతినగర్: భారతదేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రంగురంగుల కాగితాలు, తోరణాలు కట్టి ముస్తాబు చేశారు. విద్యార్థులు దుకాణాల్లో అలంకరణ వస్తువులు, బ్యాడ్జీలు, జాతీయ జెండాలు, పూలు కొంటూ వేడుకలకు సిద్ధమయ్యారు.

ధరూరు: పంద్రాగస్టు జెండా కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల వద్ద విద్యార్థుల సందడి కనిపించింది. మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలోని బీసీఎస్సార్ కాంప్లెక్స్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తోంది.

'రక్తదానం చేస్తే పునర్జన్మనిచ్చినట్లే'


రక్తదానం చేస్తున్న మెగాఫ్యాన్స్

గద్వాల: రక్తదానం చేస్తే ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి పునర్జన్మను ఇచ్చినట్లేనని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పేర్కొన్నారు. పద్మవిభూషన్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక 27వ వార్డులోని ఎర్రమట్టి వీధిలో మెగాఫ్యాన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని చైర్మన్ కేశవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రక్తదానం అన్నింటికన్నా మిన్న అని, ఆపద సమయంలో అవసరమైన రక్తాన్ని అందించి ప్రాణాన్ని రక్షించవచ్చన్నారు. తమవంతుగా మెగా ఫ్యాన్స్ రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది మెగాఫ్యాన్స్ రక్తదాన శిబిరాన్ని నిర్వహించి ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో మెగాఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు జమ్మన్న, పరశరామ్, రాజేష్, రాజు, వేణు, వీరేష్, శివ, రాము, కమ్మరిరాము, జగదీష్ పాల్గొన్నారు.

దాహం తీర్చుకునేందుకు వెళ్లి బావిలో పడి..

గట్టు: భోజనం అనంతరం దాహం తీర్చుకునేందుకు వెళ్లిన మహిళ బుధవారం బావిలో పడి మృతి చెందింది. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గట్టుకు చెందిన కుర్వ తాయప్ప గట్టు శివారులోని రాయాపురం దారిలో ఎకరా విస్తీర్ణంలో సీడ్ పత్తి సాగు చేసుకున్నారు. భర్త కుర్వ తాయప్ప, భార్య ఈరమ్మ(35) సీడ్ పత్తి పనులు చేసుకునే వారు. ఉదయం నుంచి సీడ్ పత్తి పొలంలో క్రాసింగ్ పనులు ముగించుకుని మధ్యాహ్నం భోజనం చేశారు. భోజనం అనంతరం ఉక్కపోతతో పాటుగా దాహం వేయడంతో దాహం తీర్చుకునేందుకు పొలంలోనే ఉన్న బావి వద్దకు ఈరమ్మ వెళ్లింది. ప్రమాదవశాత్తు ఆమె బావిలో పడిపోయింది. దాహం తీర్చుకునేందుకు వెళ్లి తిరిగి రాకపోవడంతో అనుమానంతో బావి వద్దకు వెళ్లిన కుటుంబ సభ్యులు బావిలో పడిన ఈరమ్మను ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలికి భర్తతో పాటుగా ఇద్దరు కుమారులున్నారు.


కుర్వ ఈరమ్మ(ఫైల్)

బీమా పథకాలపై అవగాహన

అయిజ: మండలంలోని మేడికొండలో బుధవారం స్థానిక బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ చిన్న మాబు షాబ్ అధ్యక్షతన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలకు తపాలాశాఖ పొదుపు, బీమాపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్వాల తపాలా శాఖ సహాయ పర్యవేక్షకులు సదా నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తపాలా శాఖ ద్వారా అందిచే పొదుపు, బీమా పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలకు మహిళా సమ్మాన్ సేవింగ్ ఖాతాలు, బాలికలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు ఉంటాయని తెలిపారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పలు సలహాలు, సూచనలు చేశారు.


అవగాహన కల్పిస్తున్న గద్వాల తపాలా శాఖ సహాయ పర్యవేక్షకులు సదా నాయక్

కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్ సూర్యనారాయణ, అయిజ బ్రాంచ్ ఎస్‌ఓ రవీందర్, డాక్ సేవక్ అయిజ ఎస్‌ఓ సుధాకర్, గ్రామ కార్యదర్శి దివాకర్ రెడ్డి, ఉప తపాలా కార్యాలయ బీపీఎంలు, ఏబీపీఎంలు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

దేశ చిత్రపటంతో విద్యార్థులు

అలంపూర్: పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో స్వాంతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా భారతదేశ పటాన్ని విద్యార్థులతో ఏర్పాటు చేసి అందరిని అ లరించారు. మాంటిస్సోరి ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి మాట్లాడారు. విద్యార్థుల్లో దేశభక్తిని నింపేందుకు భారతదేశ చిత్రపటాన్ని ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ రవి ప్రకాశ్, పీఈటీ శివనాయుడు పాల్గొన్నారు.


అలంపూర్ మాంటిస్సోరిలో భారత దేశ చిత్రపటంతో విద్యార్థులు

ఉత్సాహంగా ఆటల పోటీలు


మల్దకల్‌లో కబడ్డీ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు


ధరూరులో రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ధరూరు: పంద్రాగస్టును పురస్కరించుకుని ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. మూడు రోజులుగా పాఠశాలల్లో జెండా సందడి కనిపిస్తోంది. జెండా కార్యక్రమానికి సమయం దగ్గరపడడంతో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, స్కిప్పింగ్, ఖోఖో వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. గెలుపొందిన విద్యార్థుల కు జెండా రోజు బహుమతులు అందజేస్తామని ఆయా పాఠశాల హెచ్‌ఎంలు తెలిపారు.

మల్దకల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించు కుని మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం వివిధ క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నర్సింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించగా, గెలుపొందిన విద్యార్థులకు గురువారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రామాంజనేయులు గౌడ్, భాగ్యలక్ష్మి, గోవర్ధనశెట్టి, దేవసేనారెడ్డి పాల్గొన్నారు.

నవగ్రహాల ప్రతిష్ఠ



గట్టు: మండలంలోని అంతంపల్లిలో బుధవారం నూతన నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అడివి ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర గ్రామస్తులు నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రాణ ప్రతిష్ఠ, హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముమ్మరంగా హర్‌ఘర్ తిరంగా

అయిజ: హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం మండలంలోని వివిధ గ్రామాల్లో ముమ్మరంగా నిర్వహించారు. మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తన నివాస గృహంపై జాతీయ జెండాను ఎగువేశారు. ఉప్పల గ్రామంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీరేష్, నాగరాజు, యేసన్న, వినోద్ కుమార్, రాజశేఖర్ గౌడ్, తిమ్మారెడ్డి, సంజన్న పాల్గొన్నారు.

శాంతినగర్: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ గ్రామంలో బుధవారం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. బీజేవైఎం నాయకులు వెంకటేష్‌యాదవ్ గ్రామంలో ఇంటింటికి తిరిగి జెండాలు అందజేశారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించాలని కోరారు.

చెక్కుబోన్స్ కేసులో జైలుశిక్ష

గద్వాల క్రైం: అప్పు చెల్లించకుండా చెల్లని చెక్కును జారీ చేసి మోసం చేసిన కేసులో వేరుశనగ వ్యాపారికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.18లక్షల జరిమానా విధించినట్లు అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉదయ్‌నాయక్ బుధవారం తీర్పును వెల్లడించారు. బాధితుడి తరపు న్యాయవాది కృష్ణయ్య కథనం మేరకు.. గద్వాలకు చెందిన చంద్రశేఖర్, దౌదర్‌పల్లికి చెందిన వలీలు మార్కెట్ యార్డులో వేరుశనగ వ్యాపారం చేస్తున్నారు. వలీ 2017లో వ్యాపారి చంద్రశేఖర్‌తో రూ.9లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చడంలో సదరు వ్యాపారి రూ.9లక్షల చెక్కు ఇచ్చాడు. తీసుకున్న చెక్కును బ్యాంకులో వేయగా నగదు లేకపోవడంతో చెక్కుబోన్స్ అయ్యింది. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి గద్వాల కోర్టును ఆశ్రయించాడు. బుధవారం కోర్టులో చెల్లని చెక్కు కేసు విచారణకు వచ్చింది. న్యాయవాది ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టాడు. అనంతరం న్యాయమూర్తి మోసం చేసినట్లు గుర్తించి నిందితుడుకి సంవత్సరం జైలుశిక్ష, రూ.18లక్షల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు నాయ్యవాది తెలిపారు.